# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | ఆదివారం 15-8-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 12 | పేజీలు: 4 | వెల: రూ.1/-


## గాంధీకి అమెరికా ప్రతిష్ఠాత్మక 'కాంగ్రెషనల్ గోల్డ్ మెడల్'



న్యూఢిల్లీ, ఆగష్టు 14:75వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ.. జాతిపిత మహాత్మా గాంధీని ప్రతిష్ఠాత్మక 'కాంగ్రెషనల్ గోల్డ్ మెడల్' పురస్కారంతో గౌరవించుకోవాలని అమెరికా ప్రతినిధులు సభ తీర్మానించింది. న్యూయార్క్? ప్రజాప్రతినిధి కరోలిన్ బీ మెలోని ఈ ప్రతిపాదనను సభ ముందు ఉంచగా సభ్యులు ఆమోదం తెలిపారు. శాంతి, అహింస మార్గాల్లో మానవాళికి ప్రేరణగా నిలిచిన గాంధీకి ఈ పురస్కారాన్ని ఇవ్వాలని చట్టసభ్యురాలు కరోలిన్ బీ మెలోని కోరారు.మహాత్మా గాంధీ చేపట్టిన సత్యాగ్రహ ఉద్యమం, ఆయన నడిచిన అహింస మార్గాలు దేశానికి, ప్రపంచానికి ఎంతో స్ఫూర్తినిచ్చాయని కరోలిన్ బీ మెలోని పేర్కొన్నారు. ఇతరులకు సేవ చేయడం కోసం సర్వస్వాన్ని ఇచ్చేయడం అనే దానికి ఆయనో ఉదాహరణ అని చెప్పారు. గాంధీ మార్గం.. మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్, నెల్సన్ మండేలా చేపట్టిన వర్ణవివక్ష వ్యతిరేక ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చాయని తెలిపారు. ఓ ప్రజాప్రతినిధిగా గాంధీ నుంచి చాలా విషయాలు నేర్చుకుంటున్నట్లు కరోలిన్ బీ మెలోని పేర్కొన్నారు.కాంగ్రెషనల్ గోల్డ్ మెడల్ అనేది యునైటెడ్ స్టేట్స్‌లో అత్యున్నత పౌర పురస్కారం. మరణానంతరం ఈ పురస్కారం పొందనున్న మొదటి వ్యక్తి గాంధీ కానున్నారు. జార్జ్ వాషింగ్టన్, నెల్సన్ మండేలా, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్, మదర్ థెరిస్సా, రోసా పార్క్స్ వంటి గొప్ప వ్యక్తులకు లభించిన గౌరవం.. అందుకున్న మొదటి భారతీయుడుగా గాంధీ నిలిచారు.

## హుజూరాబాద్ మాదే.. ఉద్యోగాలు భర్తీ చేసేది మేమే: మంత్రి తలసాని



యాదాద్రి భువనగిరి, ఆగష్టు 14:: ప్రతిపక్షాలు ఎన్ని మాట్లాడిన హుజూరాబాద్ తమదేనని.. నియోజకవర్గ ప్రజలంతా సీఎం కేసీఆర్ వెంటే ఉన్నారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.

త్వరలో 50 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పారు. మంత్రి తలసాని కుటుంబ సమేతంగా యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అద్భుతమైన కళా ఖండంగా యాదాద్రి నిలువబోతుందని అన్నారు. మానవ సమాజం ఉన్నంతవరకు యాదాద్రి చరిత్రలో సీఎం కేసీఆర్ నిలిచిపోతారని చెప్పారు.

హుజూరాబాద్ టీఆర్ఎస్ అభ్యర్థి గెలు శ్రీనివాస్ యాదవ్‌ను బానిసగా వర్ణించిన ఈటల రాజేందర్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళితబంధు రాష్ట్ర పథకమని, రాష్టంలో ప్రతి దళితునికి పథకం అందుతుందని స్పష్టం చేశారు. పథకం ప్రారంభదశలోనే రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ప్రతిపక్షలు అంటున్నాయని, ఇది హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై ప్రశంసల వర్షం కురిపిస్తుంటే, ఇక్కడి ఎంపీ బండి సంజయ్ విమర్శించడం సిగ్గు చేటన్నారు. ఏడేండ్లుగా ఏ ఒక్క పథకాన్నైనా రాష్ట్రానికి తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. ఓట్ల కోసం కేసీఆర్, కేసీఆర్ కుటుంబంపై వ్యక్తిగత విమర్శలు చేస్తే ప్రజలు క్షమించరని అన్నారు.

యువతను లీడర్లను చేస్తున్నదే టీఆర్ఎస్ పార్టీ అని చెప్పారు. విద్యార్థి నాయకులైన గాదారి కిషోర్, బాల్క సుమన్, నోముల భగత్, తాజాగా గెల్లు శ్రీనివాస్ నాయకులుగా మారారని వెల్లడించారు. ఎంత ఎదిగిన ఒదిగి ఉండాలన్నది ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనా విధానమని చెప్పారు. తమ ప్రభుత్వం ఇప్పటివరకు 1.2 లక్షల ఉద్యోగులను భర్తీ చేసిందని, త్వరలో 50 నుంచి 60 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వేస్తామని తెలిపారు.

## గోల్కొండ కోటలో జెండా పండుగకు ఏర్పాట్లు



హైదరాబాద్ , ఆగష్టు 14: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు గోల్కొండ కోట ముస్తాబవుతున్నది. అక్కడ జరుగు తున్న రిహార్సల్స్‌తో పాటు ఏర్పాట్లను శుక్రవారం సీఎస్ సోమేశ్‌కుమార్ పరిశీ లిం చారు. అధికారులకు పలు సూచనలు చేశారు. సీఎస్ వెంట రోడ్ల భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్‌శర్మ, సందీప్‌కుమార్ సుల్తానియా తదితరులు ఉన్నారు.

## ప్రతి ఒక్కరూ గౌరవంగా బతికేలా చూడాలి : వెంకయ్యనాయుడు

న్యూఢిల్లీ, ఆగష్టు 14:దేశ ప్రజలకు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశం స్వరాజ్యం సముపార్జించుకుని 75 ఏండ్ల మైలురాయిని చేరుకుంటున్న ఈ తరుణంలో.. దేశం స్వేచ్ఛా వాయువులు పీల్చడం కోసం ఎన్నో త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో, వారి ధైర్యం, దేశభక్తిని ప్రేరణగా తీసుకుందామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంలో దేశ పురోగతి, శ్రేయస్సు కోసం పాటుపడటం ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని ఆశిస్తున్నానని తెలిపారు. దేశంలోని అన్ని స్థాయిల ప్రజలకు అభివృద్ధి ప్రయోజనాలు అందిచడం, గౌరవప్రదమైన జీవితాన్ని అందేలా చూడటం బాధ్యతగా తీసుకోవాలని, మనకున్న దాన్ని నలుగురితో పంచుకోవడం, నలుగురి సంక్షేమం పట్ల శ్రద్ధ వహించడం వంటి భారతీయ విలువలను ఆదర్శంగా తీసుకుని.. మన పౌరులందరికీ భద్రత, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం అనే రాజ్యాంగపరమైన ఆదర్శాన్ని సాధించేందుకు కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ సంతోషకరమైన సందర్భాన్ని పురస్కరించుకుని మన అంతర్గత శక్తులను తిరిగి ఆవిష్కరించుకునేందుకు, మన ప్రజల అపారమైన సామర్థ్యాన్ని గ్రహించేందుకు, వివిధ దేశాల సహకారంలో భారతదేశానికి సముచిత స్థానం సంపాదించుకునేందుకు అందరం పునరంకితమయ్యే దిశగా ప్రతిన బూనుదామని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

### చరిత్రలో నేటినిజం





( ఆగస్టు 15 నెపోలియన్ బోనా పార్టీ జయంతి..) —రాధశ్రీ

సెల్: 9494481210

## మహిళ బాత్రూం వైపుగా సీసీటీవీ కెమెరా : అభ్యంతరం తెలపడంతో దాడికి తెగబడ్డారు!

పుణే,ఆగష్టు 14:: తమ ఇంటి బాత్రూం వైపు సీసీటీవీ కెమెరా అమర్చారని, కెమెరా యాంగిల్ మార్చాలని కోరిన మహిళ సహా ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేసిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పుణే జిల్లాలోని వద్గాంషెరి ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన విరాల ప్రకారం నిందితుడు తన ఇంటి వద్ద సీసీటీవీ కెమెరాలను అమర్చగా వాటిలో ఒకటి పొరుగింటి మహిళ బాత్రూం వైపుగా ఉంది. ఈ కెమెరా యాంగిల్‌ను మార్చాలని మహిళ కోరగా ఆమెను నిందితుడు దుర్భాషలాడాడు. ఆమె సోదరుడు వారించినా అతడినీ దూషించాడు. ఆపై బాధితులు తిరిగి తమ ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికే నిందితుడు తన అనుచరులతో మహిళ ఇంటికి వెళ్లి ఆమెతో పాటు ఆమె సోదరుడు, తల్లిపైనా దాడికి దిగారు. అడ్డుగా వచ్చిన ఆమె స్నేహితురాలినీ హింసించారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు.

## ఆసరా పెన్షన్లు.. 57 ఏండ్లు నిండిన వారి నుంచి దరఖాస్తులకు ఆహ్వానం

హైదరాబాద్ , ఆగష్టు 14: గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చిన మేరకు 57 ఏండ్లు నిండిన వారిలో అర్హులకు ఆసరా పెన్షన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలను వేగవంతం చేసింది. ఇప్పటికే జీవో జారీ కాగా, దరఖాస్తుల స్వీకరణకు నిన్న ఉత్తర్వులు జారీ అయ్యాయి. 57 ఏండ్లు నిండి అర్హులైన వారు ఆగష్టు 31వ తేదీ వరకు మీ-సేవ, ఈ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుతో పాటు ఫోటో, ఆధార్ కార్డు జిరాక్స్‌ను తప్పనిసరిగా సమర్పించాలి. ఆసరా పెన్షన్లకు దరఖాస్తు చేసుకునే వారి నుంచి సర్వీసు రుసుం వసూలు చేయొద్దని ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (రాఇఖీఖ ) మార్గదర్శకాలను జారీ చేసింది.

వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, బోధకాల వ్యాధిగ్రస్తులు, నేత, గీత కార్మికులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ఆసరా పెన్షన్ల కింద రూ.2,116, అదే దివ్యాంగులకు రూ.3,116 ను ప్రభుత్వం అందిస్తోన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం 65 ఏండ్లు నిండిన వారికి ఆసరా పెన్షన్లు అందుతున్నాయి. తాజాగా తీసుకున్న ప్రభుత్వ నిర్ణయంతో లక్షలాది మందికి ప్రయోజనం కలగనుంది.

### ఆసరా పెన్షన్ పొందాలంటే..

దరఖాస్తుదారుల పేరుపై మెట్టభూమి 7.5 ఎకరాలు, మాగాణికి 3 ఎకరాలకు మించి ఉండరాదు.

కుటుంబ వార్షిక ఆదాయం గ్రామాల్లో రూ.1.5 లక్షలు, నగరాల్లో రూ.2 లక్షలు మించి ఉండకూడదు.

ఎక్కువ ఆదాయం వచ్చే వ్యాపారాలు ఉన్నా పెన్షన్‌కు అర్హులు కారు.

ఓటర్ కార్డుపై సూచించే పుట్టిన తేదీ వివరాల ఆధారంగా వయసు నిర్ధారిస్తారు.

తెల్ల రేషన్ కార్డు ఉన్నవారు మాత్రమే అర్హులు.

విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు, స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ పొందుతున్నవారు ఆసరాకు అనర్హులు.

## రూ 47,318 కోట్ల ఐటీ రిఫండ్స్ జారీ చేసిన ఆదాయ పన్ను శాఖ

న్యూఢిల్లీ, ఆగష్టు 14: ఆదాయపన్ను శాఖ 22.61 లక్షల మందికి పైగా పన్ను చెల్లింపుదారులకు రూ 47,318 కోట్లకు పైగా ఐటీ రిఫండ్‌ను జారీ చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఆగస్ట్ 9 మధ్య ఈ మొత్తాన్ని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) జారీ చేసిందని ఆదాయ పన్ను శాఖ శనివారం వెల్లడించింది.

వీటిలో రూ 14,241 కోట్లు ఐటీ రిఫండ్స్ కాగా, రూ 33,078 కోట్లు కార్పొరేట్ ట్యాక్స్ రిఫండ్స్ అని ఆదాయ పన్ను శాఖ అధికారిక ట్విటర్ ఖాతాలో వెల్లడించింది. 2020-21లో రిటన్స్ దాఖలు చేసే సమయంలో సాఫ్ట్‌వేర్ ఎర్రర్ కారణంగా పన్ను చెల్లింపుదారులు చెల్లించిన అదనపు వడ్డీ, ఆలస్య రుసుంను ఐటీ శాఖ రిఫండ్ చేస్తుందని ట్వీట్‌లో పేర్కొంది. సాఫ్ట్‌వేర్ లోటుపాట్లను సవరించామని, మరోసారి ఈ సమస్య ఎదురుకాదని తెలిపింది.

## మునుగోడు కోసం కోమటిరెడ్డి సంచలన ప్రకటన

హుజూరాబాద్ , ఆగష్టు 14హుజురాబాద్ ఉప ఎన్నిక నేపథ్యంలో సీఎం కేసీఆర్ అభివృద్ధి పేరుతో వందల కోట్లు ఆ నియోజకవర్గంపై ఖర్చు చేస్తున్నారు. దీంతో తమ నియోజకవర్గానికి కూడా నిధులు కేటాయిస్తే.. రాజీనామాకు సిద్ధమంటూ ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ప్రకటిస్తున్నారు. ప్రజలు కూడా పలు నియోజవకర్గాల్లో ఎమ్మెల్యేలను రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కొమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. మునుగోడు అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తే ఎమ్మెల్యే పదవికి పోటీచేయనని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ప్రకటించారు.

టీఆర్ఎస్ సర్పంచ్ ఉన్న దగ్గర కాంగ్రెస్ ఎమ్మెల్యేని శంకుస్థాపన చేయనీయడం లేదని ఆయన ఆక్షేపించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్న దగ్గర మంత్రిని మునుగోడు నియోజకవవర్గంలో తిరగనీయమని హెచ్చరించారు. ఎక్కడ ఎలక్షన్స్ ఉంటే అక్కడ వేల కోట్లు కుమ్మరించడం సీఎం కేసీఆర్‌కు అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర పార్టీ నేతలను గెలవనీయకుండా కేసీఆర్ కుట్ర చేస్తున్నారని రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు.

## విభజన బాధలను ఎన్నటికీ మరిచిపోలేం: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ఆగష్టు 14:ఆగస్టు 14వ తేదీని ఇక నుంచి విభజన స్మృతి దినంగా గుర్తించనున్నట్లు ప్రధాని మోదీ ఇవాళ ప్రకటించారు. తన ట్విట్టర్ అకౌంట్ ద్వారా ఆయన ఈ విషయాన్ని తెలిపారు. దేశ విభజన వల్ల కలిగిన బాధలను ఎన్నటికీ మరిచిపోలేమని ప్రధాని చెప్పారు. లక్షలాది మంది మన సోదరసోదరీమణులు చెల్లాచెదురయ్యారని, మతిలేని ద్వేషం, హింస వల్ల వేలాది మంది మరణించారని, వారి కష్టాలు, త్యాగాలకు గుర్తుగా ఆగస్టు 14వ తేదీన విభజన భయానక స్మృతి దినంగా పాటించనున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. దేశ విభజన వల్ల ప్రజల్లో సామాజిక విభజనలు వచ్చాయని, సామరస్యం లోపించిందని, ఆ విష బీజాలను పారద్రోలేందుకు పార్టిషన్ హారర్స్ రిమెంబ్రెన్స్ డే నిర్వహించాలని మోదీ తెలిపారు. ఈ స్మృతి దినం ఏకత్వ స్ఫూర్తిని నింపాలన్నారు. సామాజిక సామరస్యం, మానవ సాధికారత మరింత బలోపేతం కావాలని మోదీ తెలిపారు.

మరోవైపు ఇవాళ పాకిస్థాన్ తన స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నది. ఈ నేపథ్యంలో అత్తారి-వాఘా బోర్డర్ వద్ద పాకిస్థాన్ రేంజర్లు, బోర్డర్ సెక్యూర్టీ ఫోర్స్ స్వీట్లు పంచుకున్నారు. రేపు కూడా వాళ్లకు స్వీట్లు ఇవ్వనున్నట్లు బీఎస్ఎఫ్ కమాండెంట్ జస్బీర్ సింగ్ తెలిపారు.

## రాష్ట్ర వ్యాప్తంగా దళిత బంధు అమలు



కరీంనగర్, ఆగష్టు 14: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెడుతున్న దళిత బంధు అద్భుతమైన పథకం, దీన్ని తెలంగాణ వ్యాప్తంగా అమలు చేస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ స్పష్టం చేశారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో దళితబంధుపై సీఎస్ సోమేశ్ కుమార్, ఎస్సీ అభివృద్ధి శాఖ సెక్రటరీ రాహుల్ బొజ్జా, కలెక్టర్ కర్ణన్ కలిసి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. ఈ పథకం కింద ప్రతీ లబ్ధిదారుడికి రూ. 10 లక్షల చొప్పున ఇస్తామని ప్రకటించారు. ఈ నెల 16న జరిగే సభలో 15 మంది లబ్ధిదారులకు సీఎం కేసీఆర్ చెక్కులు అందిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తాం.. ఇందులో ఎలాంటి అనుమానం అవసరం లేదని సీఎస్ స్పష్టం చేశారు.

అనంతరం రాహుల్ బొజ్జా మాట్లాడుతూ.. దళిత బంధు పథకాన్ని హుజూరాబాద్ నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుంటున్నామని తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వే ద్వారా వచ్చిన దళితుల జాబితా తమ వద్ద ఉందన్నారు. ఈ జాబితాలో వివరాలు లేనివారిని కూడా కొత్తగా నమోదు చేస్తారు. ప్రతీ గ్రామం నుంచి నలుగురు కో ఆర్డినేటర్లు ఉంటారు. గ్రామ సభ ద్వారా లబ్ధిదారులను గుర్తిస్తారని తెలిపారు. దళిత రక్షక నిధిని కూడా ఏర్పాటు చేస్తామని రాహుల్ బొజ్జా పేర్కొన్నారు.

## స్వాతి లక్రా, బండ శ్రీనివాస్ రెడ్డికి రాష్ట్రపతి విశిష్ట సేవా పోలీసు పతకాలు



న్యూఢిల్లీ, ఆగష్టు 14: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సైనిక, పోలీసు అధికారులకు కేంద్ర హోంశాఖ వివిధ పతకాలను ప్రకటించింది. వివిధ రాష్ట్రాలకు చెందిన 1380 మంది పోలీసులకు పతకాలను ప్రకటిస్తూ.. ఆ జాబితాను కేంద్రం విడుదల చేసింది. ఇద్దరికి అత్యున్నతమైన రాష్ట్రపతి పోలీసు పతకాలు ( ఖఖఓఉ ) ప్రకటించగా, 628 మంది గ్యాలంటరీ పోలీసు పతకాలు ప్రకటించారు. 88 మందికి రాష్ట్రపతి పోలీసు పతకాలు, 662 మందికి విశిష్ట సేవా పతకాలను ప్రకటించింది. తెలంగాణకు చెందిన 14 మంది పోలీసు అధికారులకు గ్యాలంటరీ పోలీసు పతకాలు, మరో 11 మందికి ఉత్తమ సేవా పోలీసు పతకాలు వరించాయి. తెలంగాణకు చెందిన అడిషనల్ డీజీపీ, వుమెన్ సెఫ్టీ వింగ్ ఇంచార్జి స్వాతి లక్రా, జనగామ వెస్ట్ జోన్ డిప్యూటీ పోలీసు కమిషనర్ బండ శ్రీనివాస్ రెడ్డికి రాష్ట్రపతి విశిష్ట సేవా పోలీసు పతకాలు దక్కాయి.

## ఇండిపెండెన్స్ డే సందర్భంగా రుణగ్రహీతలకు ఎస్‌బీఐ తీపి కబురు..!

న్యూఢిల్లీ, ఆగష్టు 14:దేశంలోని ప్రధాన ప్రభుత్వరంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (రాఃఎ) స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రుణగ్రహీతలకు తీపి కబురు చెప్పింది. లోన్ తీసుకోవాలని భావిస్తున్న వారి కోసం ఒక మంచి ఆఫర్ ప్రకటించింది. ఈ ఆఫర్‌తో రుణం తీసుకోబోయే అందరికీ ప్రయోజనం కలుగనుంది. తమ బ్యాంకులో హోమ్ లోన్ తీసుకునే వారికి ఇండిపెండెన్స్ డే ఆఫర్‌లో భాగంగా జీరో ప్రాసెసింగ్ ఫీజు బెనిఫిట్ కల్పిస్తున్నట్లు తెలిపింది.

అంటే ఆ ఆఫర్‌లో హోమ్ లోన్ తీసుకుంటే ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజు ఉండదు. ఈ స్వాతంత్ర్య దినోత్సవం రోజున జీరో ప్రాసెసింగ్ ఫీజుతో హోమ్ లోన్స్ తీసుకుని మీ సొంతింటి కలను సాకారం చేసుకోండి అంటూ ఎస్‌బీఐ ట్వీట్ కూడా చేసింది. జీరో ప్రాసెసింగ్ ఫీజుతోపాటు మరికొన్ని బెనెఫిట్స్‌ను కూడా ఎస్‌బీఐ ప్రకటించింది. మహిళలు లోన్ కోసం దరఖాస్తు చేసుకుంటే వడ్డీ రేటుపై 5 బేసిస్ పాయింట్ల అదనపు తగ్గింపు లభిస్తుందని తెలిపింది. ఎస్‌బీఐ యోనో ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి కూడా వడ్డీ రేటుపై 5 బేసిస్ పాయింట్ల తగ్గింపు లభిస్తుంది




# అవిచ్ఛిన్న భారతంలో విచ్ఛిన్నకర అంతర్ రాష్ట్ర వివాదాలు

'అవిచ్ఛిన్న సమైక్య భారతంలో విచ్ఛిన్నకర ఆలోచనల రాష్ట్రాలు' ఉన్నాయన్న డా: బి ఆర్ అంబేడ్కర్ భావనలను నేటి 'అంతర్ రాష్ట్ర సరిహద్దు వివాదాలు' నిజం చేస్తున్నాయి. జాతీయ సమైక్యత సాధనకు ఉపకరించాల్సిన రాష్ట్రాలు, పలు కారణాలతో విభేదించడం, ప్రజల్లో స్థానిక భావనాగ్నికి ఆజ్యం పోయడం అతి ప్రమాదకరంగా మారుతున్నది. పాకిస్థాన్, చైనా లాంటి పలు పొరుగు దేశాల సరిహద్దు వివాదాలతో నిత్యం మన త్రివిధ దళాలు పోరాటం చేయడం, ప్రాణాలు కోల్పోవడం చూస్తున్నాం. దేశ బాహ్య సరిహద్దులను రక్షించుకుంటున్న భారతానికి అంతర్ రాష్ట్ర వివాదాలు చుట్టు ముట్టడం అత్యంత ప్రమాదకరం. 'భిన్నత్వంలో ఏకత్వానికి' ప్రతీక అయిన భారతం నేడు అదే కుల మత భాషా ప్రాంత వర్ణ వర్గ జాతి విభేదాలతో సమైక్య భావాలకు తూట్లు పొడవడం, స్వప్రయోజనాలకు స్వీయ భావనను పోషించడం, సామరస్యాన్ని పణంగా పెట్టడం అతి దురదృష్టకరంగా మారుతోంది. ఇటీవల బయట పడ్డ అస్సాం-మిజోరామ్ సరిహద్దు వివాదంలో రెండు రాష్ట్రాల సాయుధ బలగాలు కాల్పుల వరకు వెళ్ళడం, పోలీసులు ప్రాణాలు అర్పించడం ఆశ్చర్యాన్ని, ఆందోళనను కలిగిస్తున్నది. 1979 నుంచి ఈశాన్య రాష్ట్రాల సరిహద్దు వివాదాల పోరులో 157 మంది ప్రజలు ప్రాణాలు వదలడం అత్యంత విచారకరం. వసుధైక కుటుంబ భావనలు బలపడుతున్న వేళ రాష్ట్రాల మధ్య వివాదాలు చెలరేగడం, రాష్ట్రాల పునర్విభజన సమయంలో స్పష్టతలు కొరవడడం, రాజకీయ పార్టీల కుర్చీలాటలో వివాదాలకు ఊతం ఇవ్వడం హాస్యాస్పదంగా తోస్తున్నది. నేటి సువిశాల భారతంలో ముఖ్యమైన అంతర్ రాష్ట్ర వివాదాల లోతుల్లోకి వెళ్ళి పరిశీలిద్దాం.

### అస్సాం-మిజోరామ్ వివాదం :

ఇటీవల కేంద్ర హోం మంత్రి మాట్లాడుతూ 'భారత్‌లోని ఒక అంగుళం భూభాగాన్ని కూడా చైనా లాంటి దేశాలకు వదిలేదు లేదు' అంటూ మన భారత మనోగతాన్ని పొరుగు శత్రువుకు వినిపించారు. అదే సమయంలో తన పార్టీకి చెందిన అస్సాం ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'తమ రాష్ట్రానికి చెందిన ఒక అంగుళం భూభాగాన్ని తాము వదులు కోవడానికి సిద్ధంగా లేదని, ఎలాంటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని' తెలిపారు. ఇలాంటి అంతర్ రాష్ట్రాల వివాదం కాల్పుల వరకు వెళ్ళడం, ఐదుగురు అస్సాం పోలీసులు మరణించడం సిగ్గు చేటని విజ్ఞత కలిగిన పౌరులకు అర్థం అవుతున్నది. బ్రిటీష్ కాలం నుంచి నేటి వరకు నెలకొన్న 'బరాక్ లోయ - లుషాయ్ హిల్స్' ప్రాంతం అస్సాం-మిజోరామ్‌ల మధ్య సరిహద్దు వివాదానికి కారణం అవుతున్నది. బ్రిటీష్ కాలంలో మిజోరామ్‌ను 'లుషాయ్ హిల్స్'గా కూడా పిలిచేవారు. 1950లో అస్సాం రాష్ట్రం ఏర్పడింది. 1987లో జరిగిన పుర్విభజనలో మిజోరామ్‌తో సహా ఈశాన్య రాష్ట్రాలు ఏర్పడడం, ఆస్సాంలోని కొంత భూభాగం ఇతర కొత్త రాష్ట్రాల్లోకి వెళ్ళడంతో అంతర్ రాష్ట్ర వివాదాలు ప్రారంభమైనాయి. 1875 నోటిఫికేషన్ ప్రకారం లుషాయ్ హిల్స్, చచ్చర్ ప్రాంతాలు నిర్వచించబడ్డాయి, 1933 నోటిఫికేషన్‌లో లుషాయ్ హిల్స్, మణిపూర్‌ల మధ్య సరిహద్దు ఏర్పడింది. 1875 నోటిఫికేషన్ ప్రకారం నడవాలని మిజోరామ్, 1933 నోటిఫికేషన్ ప్రకారం అంగీకరిస్తామని అస్సాం తమ సరిహద్దు వాదనలు వినిపిస్తున్నాయి. అస్సాం-మిజోరామ్‌ల మధ్య 164.6 కిమీ సరిహద్దు ఉన్నది. గత అర్థ శతాబ్దంగా నెలకొన్న వివాదాలు ఇటీవల బయట పడడం, వివాదస్పద భూభాగాన్ని 'నో మ్యాన్స్ ల్యాండ్'గా 'యథాస్థితి (స్టాటస్ కో )' కొనసాగించాలనే నిబంధన విధించబడింది. నేడు ఆ భూభాగం కోసమంటూ రెండు రాష్ట్రాలు అనునిత్యం గిల్లికజ్జాలు పెట్టుకుంటూ పోరాడుతున్నాయి.

### అస్సాం-మేఘాలయ వివాదం :

అస్సాం-మేఘాలయ రాష్ట్రాల మధ్య దాదాపు డజన్ ప్రాంతాల్లో (అప్పర్ తరబరీ, గజాంగ్ రిజర్వ్ ఫారెస్ట్, హహిమ్, బోక్లపర, కనపర-పిలాలగ్‌కట, రటచెర్ర, క్రమూప్, చచ్చర్ లాంటి) సరిహద్దు వివాదాలు ఉన్నాయి. బ్రిటీష్ నిర్ణయం ప్రకారం నేడు అస్సాంలోని 'కర్బి ఆన్‌గ్లాంగ్' జిల్లాని 'మికిర్ హిల్స్' తమ భూభాగమని మేఘాలయ వాదిస్తున్నది. రెండు రాష్ట్రాల మధ్య ఉన్న 884.9 కిమీ సరిహద్దు వివాదాలను శాంతియుతంగా చర్చలతో పరిష్కరించుకోవాలని ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు నిర్ణయానికి రావడం హర్షదాయకం, అభినందనీయం. స్వల్ప వివాదాలు ఉన్న 6 సరిహద్దు ప్రాంతాలను వెంటనే పరిష్కరించుకుందామని ఏకాభిప్రాయానికి వచ్చారు. అధిక వివాదంలో లాంగ్‌పిహ్, బార్దుర్, నోగ్వా, మటముర్, దేశ్‌డెమెరియా, ఖాందులి ప్రాంతాలు చిక్కుకున్నాయి.

### అస్సాం-నాగాలాండ్ వివాదం :

అస్సాం-నాగాలాండ్ మధ్య 434 కిమీ పొడవైన సరిహద్దు ఉంది. అస్సాంలోని శివసాగర్, నాగావ్, జోర్హాట్, ఉరిమ్‌ఘట్, గోలఘాట్ అటవీ ప్రాంతాలు నాగా హిల్స్‌లోకి వస్తాయని నాగాలాండ్ 1963 నుంచి వాదిస్తున్నది. 1968, 1979, 1985, 2007, 2014లో జరిగిన సరిహద్దు వివాదాల్లో హింసాత్మక ఘటనలు నమోదు అయ్యాయి. ఉరిమ్‌ఘట్ ప్రాంతంలోని గ్రామాల వందల ఇళ్లకు నాగాలాండ్ అల్లరి మూకలు నిప్పంటించడం గమనించాం. నేడు రెండు రాష్ట్రాలు యథాస్థితిని పాటిస్తూ, సామరస్య ధోరణితో చర్చలు జరిపి పరిష్కరించు కోవాలని తీర్మానించడం శుభ పరిణామంగా చెప్పవచ్చు.

### అస్సాం-అరుణాచల్ ప్రదేశ్:

ఈశాన్య రాష్ట్రాల పునర్విభజన జరిగినపుడు తమకు చెందాల్సిన అధిక భూభాగాన్ని అస్సాంలోకి చేర్చారని అరుణాచల్ వాదిస్తున్నది. అస్సాం, అరుణాచల్‌ల మధ్య 804 కిమీ సరిహద్దు ఉంది. 1987లో అరుణాచల్ ఏర్పడిన తరువాత కమిటీ సిఫార్సు ప్రకారం కొంత అరుణాచల్ ప్రాంతాన్ని అస్సాంకు మార్చాలని సూచిస్తూ, మరో భాగాన్ని అస్సాం నుంచి అరుణాచల్‌కు మార్చాలని సిఫార్సు చేసింది. స్థానిక ప్రజలు క్షేత్రస్థాయిలో, ప్రభుత్వాలు సుప్రీం కోర్టులో నేటికీ పోరాటం చేస్తునే ఉన్నాయి.

### లధక్-జమ్ము కాశ్మీర్ :

ముస్లిమ్ జనాభా అధికంగా ఉన్న కార్గిల్ జిల్లాను లధఖ్‌లో కలపడాన్ని వ్యతిరేకిస్తూ, తమ జిల్లాను జమ్ము కాశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంలో కలపాలని పోరాటం చేస్తుండటం చూస్తున్నాం. ఈ ప్రాంతంలో చైనా సరిహద్దు వివాదాల కన్న ఈ అంతర్గత పోరు అధికంగా బాధ పెడుతున్నది. లధక్‌లోని లేహ్ జిల్లాలో భౌద్ధమతస్థులు అధికంగా ఉన్నారు. లధక్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా అంగీకరించని చైనా సమస్యలను సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నది. లధక్‌లో లేహ్ ప్రాంత భౌద్ధులు, కార్గిల్ ప్రాంత ముస్లిమ్‌ల మధ్య శాంతి నెలకొనడం కొంత కష్టంగానే తోస్తున్నది.

### లధక్ - హిమాచల్ ప్రదేశ్ వివాదం :

హిమాచల్‌లోని 'సర్చు' ప్రాంతానికి లధక్ వ్యాపారవేత్తలు చొరబడడంతో వివాదం మె?దలైంది. జమ్ము కాశ్మీర్ రాష్ట్రం ఉన్న సమయంలో మనాలీ-లేహ్ జాతీయ రహదారిలో లధక్ వెళ్ళే మార్గంలో పోలీస్ అవుట్ పోస్ట్ ఉండేది. హిమాచల్‌లోని లహాల్, స్పిటి జిల్లాలకు లధక్‌లోని లేహ్ జిల్లా సరిహదులకు మధ్య కొంత కాలంగా వివాదాస్పద ఘటనలు జరుగుతున్నాయి. లేహ్, మనాలీ రహదారిలో సర్చు పట్టణం ఉంటుంది. రెండు నగరాల మధ్య ప్రయాణించే ప్రయాణీకులు సర్చులో స్వల్ప విరామం కోసం ఆగుతారు. పోలీస్ అవుట్ పోస్ట్ ఉండడంతో ప్రయాణికులకు అవాంతరాలు కలుగుతున్నాయి.

### హిమాచల్ ప్రదేశ్-హర్యానా వివాదం :

హిమాచల్ ప్రదేశ్‌లోని పారిశ్రామిక 'పర్వానూ' ప్రాంతం హర్యానాలోని 'పంచ్‌కుల' జిల్లాకు మార్చాలని హర్యానా ప్రభుత్వం అనాదిగా కోరుతున్నది. రెండు రాష్ట్రాల మధ్య అటవీ భూభాగ సరిహద్దు వివాదం కూడా కొనసాగుతున్నది. ఈ అటవీ ప్రాంతంలో 'ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన', పియంజియస్‌వై కింద రోడ్డు నిర్మాణానికి కూడా అంగీకారం రావలసి ఉంది.

### ఒడిసా - ఝార్ఖండ్ వివాదం :

ఒడిసాలోని 'కియోంఝర్' జిల్లాకు చెందిన 'జగన్నాథపూర్' గ్రామం పట్ల ఇరురాష్ట్రాలు పోరాడుతున్నాయి. కియోంఝర్ జిల్లా పర్వతాల్లో జనించిన 'బైతరణి' నదీ జలాల వినియోగంలో కూడా రెండు రాష్ట్రాల మధ్య వివాదం నడుస్తున్నది. ఈ నదీ జలాలు అధికంగా ఒడిసా ప్రాంతాలకు, కొద్ది మె?త్తంలో ఝార్ఖండ్‌కు ఉపయోగపడుతున్నాయి.

### ఒడిసా-పశ్చిమ బెంగాల్ వివాదం :

'బాలసూర్' జిల్లాలోని 82 గ్రామాల పట్ల రెండు రాష్ట్రాల మధ్య వివాదం నడుస్తున్నది. ఒడిసా రాష్ట్రంలోని 30 జిల్లాల్లో 08 జిల్లాలు సరిహద్దు వివాదంలో నలుగుతున్నాయి. ఒడిసాలోని ఇనుప ఖనిజ వనరులున్న 'మయూర్‌భంజ్' జిల్లా సరిహద్దుల్లో కూడా వివాదం నలుగుతోంది.

### ఒడిసా-ఛత్తీస్‌ఘడ్ వివాదం :

ఒడిసాలోని నాబరంగ్‌పూర్, జర్సుగూడ జిల్లాల్లోని కొన్ని గ్రామాల పట్ల రెండు రాష్ట్రాలు వివాదంతో ఊగుతున్నాయి. రెండు రాష్ట్రల జల వివాదాల పరిష్కారానికి 2018లో కేంద్ర ప్రభుత్వం 'మహానది జల వివాదాల ట్రిబ్యునల్'ను ఏర్పాటు చేసింది.

### ఒడిసా- ఆంధ్రప్రదేశ్ వివాదం :

ఒడిసాలోని 'కోరపుట్' జిల్లాకు చెందిన మూడు గ్రామల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవలే ఎన్నికలు కూడా నిర్వహించింది. దీనికి తోడుగా ఒడిసాలోని గంజామ్, గజపతి, రాయగడ జిల్లాల్లోని పలు గ్రామాలు తమవే అంటూ ఆంధ్ర వాదిస్తున్నది. 1960 నుంచి రెండు రాష్ట్రాల మధ్య 'కోటిలా గ్రామ పంచాయత్'కు చెందిన 21 గ్రామాలు వివాదంలో ఉన్నాయి. ఒడిసాలోని కోరపూట్, ఆంధ్రప్రదేశ్, విజయనగరం జిల్లాల్లోని సాలుర్ ప్రాంతా ప్రజలు రెండు రాష్ట్రాల పథకాలను అనుభవిస్తున్నారు. రెండు రాష్ట్రాల మధ్య జల వివాదం కూడా ఉన్నదని, 2006లో ఒడిసా కేంద్ర ప్రభుత్వానికి పిర్యాదు కూడా చేసింది.

### మహారాష్ట్ర - కర్నాటక వివాదం:

1956 నుంచి కర్నాటకలోని మరాటీ అధికంగా మాట్లాడే ప్రజలున్న 'బెల్గామ్' జిల్లా ప్రాంతమంతా తమదే అంటూ మహారాష్ట్ర వాదనకు దిగుతోంది. బ్రిటీష్ పాలనలో బాంబే ప్రెసిడెన్సీలో ఉన్న బెల్గామ్ ప్రాంతం 1956 రాష్ట్రాల పునర్విభజనలో కర్నాటకాకు కేటాయించబడిన విషయం మనకు తెలుసు.

### తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ నీటి యుద్ధాలు :

ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం ఆంధ్ర, తెలంగాణల మధ్య జల వివాదాలు ముదిరి పాకాన పడుతున్నాయి. ఇటీవలి కాలంలో రెండు రాష్ట్రాల మంత్రులు శ్రీశైలం జలాలపై తీవ్ర ఆరోపణలు చేసుకోవడంతో పరిస్థితి చేయి దాటడం మె?దలైంది. కృష్ణ, గోదావరి నదులపై ఉన్న, నిర్మిస్తున్న ప్రాజెక్టులు రెండు రాష్ట్రాల మధ్య వివాదాలకు కారణం అవుతున్నాయి. రెండు రాష్ట్రాల జల యుద్ధాన్ని నివారించడానికి కేంద్ర జల శక్తి మంత్రిత్వశాఖ నిర్ణయించి, కృష్ణ, గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డులను (కెఆర్‌యంబి, జిఆర్‌యంబి) వేరువేరుగా ఏర్పాటు చేసింది. నదీ జలాల వివాదాలను 14 అక్టోబర్-2021 నుంచి ఈ బోర్డుల పరిధిలోకి 36 కృష్ణా నదిపై ప్రాజెక్టులను, 71 గోదావరి నదుల ప్రాజెక్టులను తెస్తున్నామని, ఈ బోర్డులే ప్రాజెక్టుల నిర్వహణ, ఆపరేషన్, పాలన, రెగ్యులేషన్ పనులను చూసుకుంటాయని, దీని కోసం ఒక్కో రాష్ట్రం 200 కోట్లును బోర్డుల పేరున జమచేయాలని సూచించింది.

భారతదేశంతో ఇరుగుపొరుగు దేశాలు 15,107 కిమీ పొడవు సరిహద్దులను, 7,517 కిమీ తీర ప్రాంతాలను కలిగి ఉంది. ఇండియాకు బాహ్య ముఖ్య శత్రు దేశాలుగా చైనా, పాకిస్థాన్ నిత్యం కాలు దువ్వుతున్నారు. ఈ దేశాలతో పాటుగా మయన్మార్, నేపాల్, భూటాన్‌లు కూడా సరిహద్దు వివాదాలను రేపుతున్నాయి. సరిహద్దు దేశాలతో అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, వారి కదలికలను గమనిస్తూ, అవసరమయునపుడు వారికి సరైన బుద్ధి చెప్పడానికి భారత్ ఎన్నడు వెనకడుగు వేయలేదు. బాహ్య శత్రువులను సమర్థవంతంగా ఎదుర్కొంటున్న భారతంలో అంతర్ రాష్ట్ర వివాదాలు అంతర్గత అశాంతికి కారణం కావడం సోచనీయం. వివిధ రాష్ట్రాల మధ్య నెలకొన్న వివాదాలను కేంద్ర ప్రభుత్వ మధ్యవర్తిత్వంతో శాంతియుతంగా పరిష్కరించుకోవాలని 'స్వాతంత్ర్య దిన వజ్రోత్సవాల' వేళ ప్రతిన బూనుదాం. 'ఆజాద్ కా అమృత్ మహోత్సవ్' ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# పెంపుడు కుక్కకు కాంస్య విగ్రహం!

అమరావతి, ఆగష్టు 14:మనుషుల కంటే కుక్కలకే ఎక్కువగా విశ్వాసం ఉంటుందని ఉంటారు. చాలా మంది పెంపుడు జంతువులను తమ కన్న బిడ్డల్లా చూసుకుంటారు. పెంపుడు కుక్కపై అమితమైన ప్రేమను పెంచుకున్న ఓ యజమాని? చనిపోయిన కుక్కకు విగ్రహం చేయించి పూజలు కూడా చేస్తున్నాడు.

వివరాల్లోకి వెళ్తే.. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం అంపాపురం గ్రామానికి చెందిన సుంకర జ్ఞానప్రకాశరావు గతంలో ఓ కుక్కను పెంచుకున్నారు. దానికి శునకరాజు అని పేరుపెట్టడమే కాకుండా కుటుంబ సభ్యుల కంటే ఎక్కువగా చూసుకున్నాడు. ఆ శునకం కూడా జ్ఞానప్రకాశరావుపై ఎంతో విశ్వాసంతో ఉండేది. ఆయన చెప్పినదల్లా అర్థం చేసుకునేది. అయితే, ఐదేళ్ల క్రితం పెంపుడు కుక్క శునకరాజు మరణించింది. అప్పటి నుంచి దాని జ్ఞాపకాల్లోనే జీవిస్తున్నాడు. ప్రతి ఏడాది దాని వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. అయితే, తమ పెంపుడు కుక్క జ్ఞాపకాలను మరచిపోలేని జ్ఞానప్రకాశరావు కుటుంబం దానికి ఏకంగా కాంస్య విగ్రహం చేయించింది. ఇంటి దగ్గరే విగ్రహాన్ని ఏర్పాటు చేసి దాని ఆత్మహకు శాంతి కలగాలంటూ పండితులను పిలిచి శాస్త్రోక్తంగా పూజలు చేయించారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# దళిత బంధు సభ.. టీచర్లకు జనసమీకరణ బాధ్యత!

హైదరాబాద్ , ఆగష్టు 14:తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 'దళిత బంధు' పథకాన్ని ఈ నెల 16న ముఖ్యమంత్రి కేసీఆర్ హుజురాబాద్ లో ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో సీఎం సభను విజయవంతం చేయాల్సిన బాధ్యతను ప్రభుత్వ టీచర్లపై పెట్టారు. జనసమీకరణ బాధ్యత టీచర్లకు అప్పగిస్తూ కరీంనగర్ జిల్లా విద్యాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమానికి జనాన్ని తరలించాలంటూ డీఈవో ప్రభుత్వ ఉపాధ్యాయులను ఆదేశించారు.

హుజూరాబాద్‌లో దళితబంధు పథకాన్ని ప్రారంభించేందుకు ఈ నెల 16న సీఎం కేసీఆర్ అక్కడికి వెళ్లనున్న నేపథ్యంలో డీఈవో ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యమంత్రి హుజూరాబాద్ పర్యటనకు ప్రజలను బస్సుల్లో తరలించే బాధ్యతను ఎంఈవోలు, జీహెచ్ఎంలు, కోఆర్డినేటర్లు చూసుకోవాలంటూ ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వారిని స్పెషల్ ఆఫీసర్లుగా పేర్కొంటూ మరో 150 మందిని రూట్ ఆఫీసర్లుగా నియమించుకోవాలని సూచించారు. జనసమీకరణ, తరలింపు, కార్యక్రమ ఏర్పాట్లపై చర్చించేదుకు శనివారం నిర్వహించనున్న సమావేశానికి హాజరు కావాలని నిర్దేశించారు. అయితే డీఈవో జారీ చేసిన ఈ ఉత్తర్వులపై ఉద్యోగుల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. జనసమీకరణ బాధ్యతను ప్రభుత్వ ఉపాధ్యాయులకు అప్పగించడమేంటని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# బాలలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషి

హైదరాబాద్ , ఆగష్టు 14: నేటి బాలలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దడానికి సీఎం కేసీఆర్ విశేషంగా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. కాచిగూడలోని నింబోలిఅడ్డా జువైనల్ హోంలో రూ.3.60 కోట్లతో మూడంతస్థుల నూతన భవనాన్ని నిర్మించారు. ఈ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలికలకు అవకాశమిస్తే సాధించలేనిది ఏదీలేదన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని, లేనియెడల వారిపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన పేర్కొన్నారు. పిల్లలకు చిన్ననాటి నుంచే సహనం, ఓపిక వంటి మంచి లక్షణాలను నేర్పించాలని తెలిపారు. పిల్లలు తల్లిదండ్రులకు పలు సమస్యలపై ఫిర్యాదు చేస్తే శ్రద్ధగా వినాలని, లేకుంటే చెడుదారి పట్టే ప్రమాదం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య, దూసరి శ్రీనివాస్‌గౌడ్, బాలికల సదనం సూపరింటెండెంట్ మైథిలి, లలిత, ఎర్ర భీష్మ, రెడపాక రాము, నర్సింగ్‌యాదవ్, పట్లూరి సతీశ్, యూసుఫ్‌శరీఫ్, పి.సంతోష్, సాయి విద్యార్థులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌ను వీడి టీఆర్ఎస్‌లో చేరికలు



నాగర్‌కర్నూల్, ఆగష్టు 14:: టీఆర్ఎస్‌లోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉంది. తాజాగా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తాడూర్ మండలంలోని భలాన్‌పల్లి గ్రామ సర్పంచ్ అశోక్, ఉప సర్పంచ్ సుధాకర్, వార్డు మెంబర్స్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి టీఆర్ఎస్‌లో చేరారు. వారికి నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# 2022 జూలై 1 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం

న్యూఢిల్లీ, ఆగష్టు 14: వచ్చే ఏడాది జూలై 1 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల తయారీ, అమ్మకం, వినియోగాన్ని కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహితంగా దేశాన్ని తీర్చిదిద్దే క్రమంలో చేపట్టిన చర్యల్లో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాలు, నిర్వహణ సవరణ నియమాలను శుక్రవారం జారీ చేసింది. దీంతో 2020 జూలై 1 నుంచి ఒకసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్ వస్తువులైన స్ట్రాస్, ప్లేట్లు, కప్పులు, ట్రేలు, పాలీస్టైరిన్, క్యారీ బ్యాగ్స్ వంటి వాటి తయారీ, అమ్మకం, వినియోగాన్ని పూర్తిగా నిలిపివేస్తారు.

అలాగే పాలిథిన్ సంచుల మందం 50 మైక్రాన్ల నుండి 120 మైక్రాన్లకు కేంద్ర ప్రభుత్వం పెంచింది. పాలిథిన్ సంచుల మందంలో మార్పు రెండు దశల్లో అమలు చేయనున్నారు. మొదటి దశ ఈ ఏడాది సెప్టెంబర్ 30 నుంచి అమలులోకి వస్తుంది. తొలుత 75 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న బ్యాగ్‌లపై నిషేధం విధిస్తారు. రెండవ దశలో భాగంగా 120 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న పాలిథిన్ క్యారీ బ్యాగ్స్‌ను 2022 డిసెంబర్ 31 నుంచి నిషేధిస్తారు.

అయితే, కంపోస్టబుల్ ప్లాస్టిక్‌తో చేసిన బ్యాగ్‌లకు ఈ మందం మార్గదర్శకాలు వర్తించవు. వీటి తయారీదారులు లేదా వాటిని ఉపయోగించే బ్రాండ్ యజమానులు వాటిని విక్రయించడానికి లేదా ఉపయోగించడానికి ముందు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (అఖఅః) నుండి సర్టిఫికేట్ పొందాల్సి ఉంటుంది.

మరోవైపు పట్టణ స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలు వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేయడంతోపాటు నిర్వహణకు బాధ్యత వహించాలని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ప్లాస్టిక్ వ్యర్థాల విభజన, సేకరణ, నిల్వ, ప్రాసెసింగ్, సరైన విధంగా పారవేయడాన్ని స్థానిక సంస్థలు పర్యవేక్షించాలని తెలిపింది. ఈ మేరకు ప్లాస్టిక్ వ్యర్థాలు, నిర్వహణ సవరణ నియమాలపై కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది.

# దళిత బంధు ఎన్నికల స్టంట్ కాదు.. దళితులను బాగు చేసే స్టంట్'

హైదరాబాద్ , ఆగష్టు 14:దళిత బాంధవుడు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న దళిత బంధు పథకం ఎన్నికల స్టంట్ కాదు.. దళితులను బాగు చేసే స్టంట్ అని చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ స్పష్టం చేశారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దు. దళిత బంధు అందరికీ వస్తుంది.. ఆగం కావొద్దు అని సూచించారు. దేశానికే ఈ పథకం ఆదర్శంగా నిలవబోతుందని, నవశకానికి మరో అంబేద్కర్ కేసీఆర్ అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇల్లందకుంట మండల కేంద్రంలో మీడియాతో ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడారు.

దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం అని ఎమ్మెల్యే కొనియాడారు. సింహ గర్జన అయినా సంక్షేమ పథకం అయినా కరీంనగర్ జిల్లా నుండే మొదలవుతుందని గుర్తు చేశారు. ఈ గడ్డ మీద నుంచి ఏ పథకం ప్రారంభించినా వందకు వంద శాతం విజయవంతం అవుతుందన్నారు.

ఈ పథకం అమలుతో దళితులు ఎదుగుతారనే అనే ఈర్ష్య ప్రతిపక్షాల్లో మొదలైందన్నారు. రాబోయే మూడేండ్లలో ప్రతి దళిత కుటుంబానికి లబ్ది చేకూరుతుందన్నారు. నియోజకవర్గానికి 100 మంది చొప్పున ఎంపిక చేసి ఈ పథకాన్ని అమలు చేస్తామన్నారు. దళిత బంధు డబ్బులు నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. దళితుల ఆర్థిక ఎదుగుదలకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్‌కు దళితులందరూ రుణపడి ఉంటారని పేర్కొన్నారు.ఎస్సీ సబ్ ప్లాన్‌తో సంబంధం లేకుండా బడ్జెట్‌లో ఈ పథకం అమలు కోసం రూ. 1500 కోట్లు కేటాయించారని, అవసరమైతే మరో రూ. 500 కోట్లు కేటాయిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. గతంలో దళితులను ఓటు వేసే యంత్రాలుగా పరిగణించేవారు. కానీ కేసీఆర్ దళితుల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే రవిశంకర్ ప్రశంసించారు

# హుజూరాబాద్ నియోజకవర్గంలోని ప్రతీ దళిత కుటుంబానికి దళితబంధు : మంత్రి హరీశ్‌రావు

కరీంనగర్ ఆగష్టు 14:(నేటినిజం ప్రతినిధి): జిల్లాలోని హుజూరాబాద్ నియోజకవర్గంలోని ప్రతీ దళిత కుటుంబానికి దళిత బంధు అందుతుందని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోమంత్రి శనివారం మీడియాతో మాట్లాడారు. దళిత బంధుకు సీఎం కేసీఆర్ హుజూరాబాద్‌ను పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకున్నారు. ఎల్లుండి(సోమవారం) హుజూరాబాద్‌లో సీఎం కేసీఆర్ దళితబంధును ప్రారంభిస్తారు. అర్హులైన 15 మందికి సీఎం స్వయంగా చెక్కులు అందజేయనున్నారు. నియోజకవర్గంలోని ప్రతీ దళిత కుటుంబానికి దళితబంధు అందుతుంది. ఈ విషయంలో ఎవరికి ఎటువంటి అనుమానాలు, అపోహలు అవసరం లేదు. కాంగ్రెస్, బీజేపీ నేతలు అపోహలు సృష్టిస్తున్నారు. రైతుబంధు విషయంలో కూడా ఇటువంటి అపోహలే సృష్టించారు.ఎన్నికల కోసమే దళిత బంధు అని అంటున్నరు. దళిత ఎంపవర్‌మెంట్ పేరుతో ఓ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో నేనే చెప్పాను. తన నియోజకవర్గ ప్రజలకు మంచి జరుగుతుంటే ఆహ్వానించాలి. కానీ దురదృష్టం ఏంటంటే దళితబంధును వ్యతిరేకిస్తున్నారు. బండి సంజయ్ రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నడు. రాష్ట్ర ప్రభుత్వం శక్తి మేరకు రూ.10 లక్షలు అందిస్తున్నాం. మిగతా రూ.40 లక్షలు కేంద్రం నుంచి బండి సంజయ్ ఇప్పించాలి. కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందజేస్తే పాలాభిషేకం చేస్తాం. ప్రభుత్వ చర్యను ఆహ్వానించాల్సిందిపోయి కుట్రలు చేస్తే ఆ కుట్రల్లో మీరే మాడి మసైపోతారని హరీశ్ రావు అన్నారు.

# దళిత బంధుపై చల్లారని వేడి.. టీఆర్ఎస్‌లో టెన్షన్

హైదరాబాద్ , ఆగష్టు 14:దళిత బంధు పథకం ప్రారంభానికి ముందే వివాదం రాజేసింది. తెలంగాణ ప్రభుత్వం దళిత బంధు పకథం అమలు చేయనున్న వేళ నిరసనలు వ్యక్తమవుతున్నాయి. దళిత బంధుపై రెండు రోజులుగా హుజురాబాద్‌లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. దళిత బంధును అర్హులకు ఇవ్వడం లేదంటూ ఆరోపిస్తున్నారు. దళితుల ఆందోళనలతో టీఆర్ఎస్‌లో టెన్షన్ నెలకొంది.

హుజురాబాద్‌లో దళితులు చేపట్టిన రాస్తారోకోతో వరంగల్- కరీంనగర్ రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. దళిత బంధు అందరికి ఇవ్వాలని దళితులు డిమాండ్ చేస్తున్నారు. భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో దళితుల ధర్నాను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో దళితులు వాగ్వాదానికి దిగారు.

మరోవైపు హుజురాబాద్ నియోజకవర్గవ్యాప్తంగా దళితులు ఆందోళనకు దిగారు. కరీంనగర్‌లో ముగ్గురు మంత్రులు హరీష్ రావు, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ లు సమావేశం నిర్వహిస్తున్న సందర్భంగా దళిత బంధుపై ఆందోళనలు చెలరేగడం గమనార్హం. ఈ నెల 16న హుజురాబాద్‌కు సీఎం కేసీఆర్ వెళ్లనున్నారు. సీఎం సభ లోపే దళితులు శాంతిస్తారా? లేదా? అన్నది ఉత్కంఠగా మారింది.

# దేవాలయాలు ధర్మపరిరక్షణ కేంద్రాలు: విద్యా శంకర భారతీస్వామి



హైదరాబాద్ , ఆగష్టు 14:ధర్మ పరిరక్షణ కేంద్రాలుగా దేవాలయాలు నిలుస్తాయని శ్రీశ్రీశ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన పీఠాదీశ్వరులు శ్రీమదభినవోద్ధండ విద్యా శంకర భారతీస్వామి అన్నారు. చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం పునర్నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యా శంకర భారతీస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరి పై ఉందని సూచించారు. ఆత్మ సంతృప్తితో జీవించాలని ఆయన ప్రజలకు సూచించారు. దేవాలయాలను పునర్నిర్మించడం సంతోషాదాయకం అన్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వంలోనే దేవాలయాల అభివృద్ధి జరుగుతున్నాయని తెలిపారు. యాదాద్రి దేవాలయానికి దేశ వ్యాప్తంగా గుర్తింపు లభిచిందన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.

ఆలయ చైర్మన్ గుండెపూడి మురళీ ప్రసాద్, కార్యనిర్వాహణ అధికారి మాచర్ల దేవనాథం పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్, దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎం.రామకృష్ణారావు, డిప్యూటి ఇంజనీర్ పాండురంగ విఠల్, ఏఈ బాలయ్య, పార్టీ యువ నాయకుడు ముఠా జైసింహ, దాతలు దేవాలయం మాజీ ధర్మకర్త జానకి సుధాకర్, సినీ ఆర్టిస్టు డాక్టర్ సి.వెంకట గోవిందరావు, డాక్టర్ టి.రామకృష్ణ, ధర్మకర్తలు డాక్టర్ జి.కె.రమణ, ముసునూరి భాస్కర్, మురికి గణేశ్, జ్యోతి ప్రభుషా, గంట్యాల ప్రభాకర్, ఎం.వెంకటరమణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



# రాహుల్ గాంధీ ట్విట్టర్ అకౌంట్ అన్‌లాక్

న్యూఢిల్లీ, ఆగష్టు 14: కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ( ఖీజీఫ్తబీశ్రీ ఉ జీనిటప్తతి ) తో పాటు ఆ పార్టీకి చెందిన ఇతర నేతల అకౌంట్లను.. ట్విట్టర్ సంస్థ అన్‌లాక్ చేసింది. ఇటీవల ఢిల్లీలో రేప్, హత్యకు గురైన ఓ తొమ్మిదేళ్ల బాలిక ఫ్యామిలీ ఫోటోను ట్వీట్ చేసిన నేపథ్యంలో రాహుల్‌తో పాటు ఆ పార్టీ నేతల అకౌంట్లను ట్విట్టర్ సంస్థ తాత్కాలికంగా లాక్ చేసిన విషయం తెలిసిందే. అయితే శుక్రవారం రాహుల్ .. ట్విట్టర్‌పై విరుచుకుపడ్డారు. భారతీయ రాజకీయ వ్యవస్థలో జోక్యం చేసుకుని ట్విట్టర్ సంస్థ ప్రమాదకర ఆట ఆడుతున్నట్లు రాహుల్ విమర్శించారు. ఈ నేపథ్యంలో ఇవాళ ట్విట్టర్ సంస్థ కాంగ్రెస్ పార్టీ అకౌంట్లను తిరిగి అన్‌లాక్ చేసింది. అయితే అన్‌లాకింగ్‌కు సంబంధించి ట్విట్టర్ సంస్థ ఎటువంటి వివరణ ఇవ్వలేదని ఆ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జి రోహన్ గుప్తా తెలిపారు.

# శ్రీకాకుళంలో విషాదం.. సముద్రంలో పడవ బోల్తా

అమరావతి, ఆగష్టు 14:శ్రీకాకుళం జిల్లాలోని గార మండలం బందరువానిపేట తీరంలో విషాదం చోటు చేసుకుంది. శనివారం వేకువజామున సముద్ర తీరంలో చేపల వేటకు వెళ్లిన పడవ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురు మత్స్యకారులు గల్లంతవగా ఒకరు మృతి చెందారు. పడవలో ఏడుగురు మత్స్యకారులు వేటకు వెళ్లినట్లు తెలుస్తోంది. గల్లంతైన మిగిలిన ముగ్గురు మత్స్యకారుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన వారి కుటుంబసభ్యులు జాలర్ల కోసం ఆందోళన చెందుతున్నారు.

# ఘనంగా నాగుల పంచమి పర్వదినం



హైదరాబాద్ , ఆగష్టు 14:నాగుల పంచమిని పురస్కరించుకొని ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు అత్యంత పవిత్రంగా కొలిచే నాగుల పంచమి పర్వదినం సందర్భంగా నాగదేవత ఆలయాలు, పుట్టల వద్ద మహిళలు పాలుపోయడానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం నుంచి మహిళలు అమ్మవారి ఆలయాలు, పాముల పుట్టల వద్దకు చేరుకొని పుట్టలో పాలు పోసి, పూలు, నైవేధ్యాలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ముషీరాబాద్ డివిజన్ గంగపుత్ర కాలనీలో నాగదేవత ఆలయంలో నాగుల పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే ముఠా గోపాల్, టీఆర్ఎస్ నాయకులు ముఠా జయసింహ, సుధాకర్ గుప్త, గోవింద్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాంనగర్ రామాలయం, లలితానగర్ గండమ్మ దేవాలయాల్లో నాగుల పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకల పోలీసు కవాతు ప్రాక్టీస్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఐ.పి.ఎస్



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 14:(నేటినిజం ప్రతినిధి): ఆదివారం నాడు జరుగబోయే స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భారతదేశ మువ్వెన్నల పతాకానికి వందనం సమర్పించే స్వాతంత్ర దినోత్సవ పవిత్ర కార్యక్రమానికి శనివారం నాడు జిల్లా కేంద్రంలోని తడూర్ నందు గల పోలీస్ హెడ్ క్వార్టర్స్ మైదానంలోనిర్వహిస్తున్న సాయుధ బలగాల కవాతు ప్రాక్టీస్ లో భాగంగా జిల్లా సాయుధ దళాధిపతి,పరేడ్ కమాండర్ గారిజర్వ్ఇన్స్పెక్టర్,కుమారస్వామి, మరియు ప్లాటున్స్ కమెండేట్ లుగాఎస్.ఐలు ప్రవళిక,క్రాంతికుమార్ వ్యవహరించగా ప్లాటున్స్ పరేడ్ లో పాల్గొన్నాయి.ప్రాక్టీస్ పరేడ్ లో భాగంగా మొదటగా ఎస్పీ పోలీస్ ల గౌరవా వందనాన్నిస్వీకరించారు.అనంతరం సాయుధ బలగాల పోలీసుల కవాతు ప్రాక్టీసు కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే పరిశీలించారు.అనంతరం సాయుధ బలగాల అధికారులకు కవాతు సిబ్బందికి పలుసూచనలు చేశారు స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు.వేడుకలకు వచ్చే ప్రతి ఒక్కరు కోవిడ్ నిబంధనలుపాటించాలనిఅన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్.ఐ రజినీకాంత్ సిబ్బంది పాల్గోన్నారు..

# క్రీడలతో యువకుల నైపుణ్యత పెంపొందుతుంది





రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 14:(నేటినిజం ప్రతినిధి): క్రీడల తో క్రీడాకారులకు వ్యక్తిగత నైపుణ్యత పెంపొందుతుందని కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ అన్నారు.శనివారంవేములవాడ పట్టణం ఇండియన్ గ్యాస్ గోదాం దగ్గర ఉన్న గ్రౌండ్లోనిర్వహించినటువంటి వి పి ఎల్ టోర్నమెంట్ ను ప్రారంభించిన కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసానికి ఉత్సాహానికి ఎంతగానో దోహదపడుతుందని ఆయన అన్నారు చదువుతోపాటు క్రీడలు లో ముందుకు రావాలని ఆయన అన్నారు.పట్టణ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామిమాట్లాడుతూక్రీడా లతో మానసికోల్లాసంతోపాటు శారీరక వ్యాయామం కూడా కలుగుతుందన్నారు.క్రీడా రంగాల్లో రాణిస్తే యువకులకు గుర్తింపుతోపాటు ఉద్యోగావకాశాలు కూడా వస్తాయని తెలిపారు . ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, శభాష్ పల్లి సర్పంచ్ పండుగ ప్రదీప్, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్, బీసీ సెల్ టౌన్ ప్రెసిడెంట్ నాగుల రాము గౌడ్ గౌడ్, పోతుగంటి వెంకన్న కీడా నిర్వాహకులు శహిద్, షకీల్, అతిఫ్, ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.

# సీఎం సభపై హరీష్ రావు పర్యవేక్షణ!



హైదరాబాద్ , ఆగష్టు 14:దళిత బంధు పథకాన్ని సోమవారం ముఖ్యమంత్రి కేసీఆర్ హుజురాబాద్ నియోజకవర్గంలో ప్రారంభించనున్న నేపథ్ంయలో సీఎం సభ కోసం ముమ్మర ఏర్పట్లు చేస్తున్నారు. ఈ పథకం తొలుత పైలట్ ప్రాజెక్ట్ కింద హుజురాబాద్ లో అమలుకానుంది. శాలపల్లి వెళ్లి సీఎం బహిరంగ సభా ఏర్పాట్ల చేశారు. ఈ నేపథ్యంలో దళిత బంధు కార్యక్రమం ఏర్పాట్లను మంత్రులు హరీష్ రావు, గంగుల కమలాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో దళితబంధుపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన అధికారులు హాజరయ్యారు. ఈ సమావేశం ముగిసిన వెంటనే మంత్రులు శాలపల్లి వెళ్లి సీఎం బహిరంగ సభా ఏర్పాట్లను పరిశీలిస్తారు.

తెలంగాణ ప్రభుత్వం దళిత బంధు పథకం కింద.. ఒక్కో నిరుపేద దళిత కుటుంబానికి రూ. 10 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దత్తత గ్రామమైన వాసాలమర్రిలో ప్రారంభించినప్పటికీ.. పైలట్ ప్రాజెక్టు కింద హుజూరాబాద్ నియోజకవర్గంలో దీనిని అమలు చేయనున్నారు. ఆగష్టు 16ను ముఖ్యమంత్రి కేసీఆర్ శాలపల్లి-ఇందిరానగర్ వద్ద దళితబంధును ప్రారంభించనున్నారు. ఇప్పటికే హుజూరాబాద్ నియోజకవర్గంలో దళిత బంధు అమలుకు కోసం రూ.500 కోట్లు విడుదల చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో అనేక కార్యక్రమాలను ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచే ప్రారంభించారు. తెలంగాణ ఉద్యమానికి నాందిగా నిర్వహించిన 'సింహ గర్జన' సభ మొదలకొని, తాను ఎంతగానో అభిమానించిన 'రైతు బీమా' పథకం దాకా కరీంనగర్ జిల్లా నుంచే సీఎం ప్రారంభించారు. అదే విధంగా ప్రతిష్టాత్మకమైన 'రైతుబంధు' పథకాన్ని కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ కేంద్రంగానే ప్రారంభించారు. అదే ఆనవాయితీని సీఎం సెంటిమెంటును కొనసాగిస్తూ 'తెలంగాణ దళిత బంధు' పథకాన్ని కూడా హుజూరాబాద్ నుంచే ప్రారంభించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు.

హుజూరాబాద్ నియోజకవర్గంలోని అన్నిమండలాల్లోని దళిత కుటుంబాల వివరాల స్థితిగతులను ఇప్పటికే తెలుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ముందుగా నిర్ణయించిన ప్రకారమే తెలంగాణ దళిత బంధు పథకం రూ. 1200 కోట్లతో అమలవుతుందని సీఎం తెలిపారు. అయితే పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినందున అధనంగా మరో 1500 నుంచి 2000 కోట్ల రూపాయలను పైలట్ నియోజకవర్గమైన హుజూరాబాద్ లో ఖర్చు చేయనున్నట్టు ఇప్పటికే సీఎం ప్రకటించారు.

# వయోధికుల ప్రయోజనాల పరిరక్షణకు పెద్దపీట: మంత్రి తలసాని



హైదరాబాద్ , ఆగష్టు 14:వయోధికుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కొవిడ్ కారణంగా గత రెండేండ్లుగా అంతర్జాతీయ వయోధికుల దినోత్సవం జరపుకోలేని పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో ఇటీవలే ఎస్ఆర్‌నగర్ వయోధికుల సంఘం ప్రతినిధులు కౌన్సిల్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు జరుపుకున్నారు.ఈ వేడుకలకు హాజరు కావాల్సిన మంత్రి తలసాని ప్రభుత్వ కార్యాక్రమాల్లో బిజీగా ఉండడం వల్ల హాజరుకా లేకపోయారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం కౌన్సిల్ అధ్యక్షులు కాసాని సహదేవ్‌గౌడ్ ఆధ్వర్యంలో వయోధికుల మండలి ప్రతినిధులు మంత్రి తలసానిని ఆయన నివాసంలో కలుసుకుని జ్ఞాపికను బహుకరించి శాలువతో సత్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ ఎస్ఆర్‌నగర్ వయోధికుల మండలి చేపడుతున్న కార్యాక్రమాలకు తనవంతు పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండలి ప్రధాన కార్యదర్శి డి.అనంతరెడ్డి, కోశాధికారి యాదగిరి, కార్యనిర్వాహక కార్యదర్శి పెరుమాండల లింగమయ్యతో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఈటల రాజేందర్‌కు అదిరిపోయే పంచ్ ఇచ్చిన హరీశ్‌రావు

హుజూరాబాద్,ఆగష్టు 14: బీజేపీ నేత ఈటల రాజేందర్‌కు ఆర్థిక మంత్రి హరీశ్ రావు అదిరిపోయే పంచ్ ఇచ్చారు. నాడు రైతు బంధు ప్రవేశపెడితే చప్పట్లు కొట్టిన చేతులే నేడు దళిత బంధు ప్రారంభిస్తుంటే గుండెలు బాదుకుంటున్నాయని ఎద్దేవా చేశారు. హుజూరాబాద్‌లోని సిటీ సెంటర్‌లో మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. దళితబంధుపై ఎవ్వరూ చెప్పుడు మాటలు వినవద్దని సూచించారు. 'దళితబంధు విషయంలో అపోహలు, అనుమానాలు అక్కర్లేదు.

రైతుబంధు ప్రారంభించినప్పుడు ఇదే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఇలాగే మాట్లాడారు. రైతుబంధును కరోనా కాలంలో కూడా అమలు చేశాం. హుజూరాబాద్‌లో ప్రారంభించినప్పుడు చప్పట్లు కొట్టిన నాయకులే.. నేడు దళిత బంధు ప్రారంభిస్తామంటే అదే చేతులతో గుండెలు బాదుకుంటున్నారు. ఆ రోజు రైతుబంధు ప్రారంభించినప్పుడు ఇలాంటి అనుమానాలు, అపోహలు సృష్టించారు. వారికి ఓటమి భయం పట్టుకుంది. ప్రజలను రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తున్నారు. దళిత బంధు ఎన్నికలప్పుడు ప్రారంభించడం లేదు. గత సమావేశాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడే సీఎం దళిత్ ఎంపవర్‌మెంట్ అనే కార్యక్రమాన్నిఈ ఏడాది ప్రారంభిస్తున్నామని చెప్పారు. మార్గదర్శకాలు విడుదలవుతాయని బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. అప్పుడు ఏ ఎన్నికలు లేవు' అని మంత్రి అన్నారు.

'ఇదే హుజూరాబాద్‌లో రైతుబంధు ప్రారంభిస్తే ఒప్పు.. దళితబంధు ప్రారంభిస్తే తప్పు ఎట్ల అయితది. ఆరోజు ఒప్పయింది.. ఇవాళ కూడా ఒప్పు అయితది కదా. మేలు జరుగుతుందంటే ఆహ్వానిస్తారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతారు. కానీ దురదృష్టం ఏంటంటే ఇక్కడ నిరసనలు తెలుపుతున్నారు. అక్కసు వెళ్లగక్కుతున్నారు. కుట్రలు, కుతంత్రాలు, అపోహలు, అనుమానాలు సృష్టించి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు గమనిస్తున్నారు. నిజంగా ప్రేమ ఉంటే కేంద్రం నుంచి మరో రూ. 10 లక్షలు తెప్పించండి. లేదంటే మాకంటే ఎక్కువ ఇవ్వాలనిపిస్తే రూ.20 లక్షలు ఇవ్వండి. బండి సంజయ్ 50 లక్షలు ఇవ్వాలంటున్నారు. రాష్ట్రం 10 లక్షలు ఇస్తుంది కదా. మిగతా 40 లక్షలు కేంద్రం నుంచి తెప్పిస్తే మీకు, మీ నరేంద్ర మోదీకి పాలాభిషేకం చేస్తాం' అని హరీశ్‌రావు బీజేపీ నేతల దుమ్ముదులిపారు.

# మాల్యా కింగ్‌ఫిషర్ హౌస్ కొనుగోలు చేసిన హైదరాబాద్ సంస్థ

ముంబై, ఆగష్టు 14: బ్యాంకులకు సుమారు రూ.9,000 కోట్ల రుణాలు ఎగవేసి బ్రిటన్ పారిపోయిన వ్యాపారవేత్త విజయ్ మాల్యాకు చెందిన కింగ్‌ఫిషర్ హౌస్‌ను హైదరాబాద్‌కు చెందిన ఒక సంస్థ కొనుగోలు చేసింది. మాల్యాకు చెందిన కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ ప్రధాన కార్యాలయమైన ముంబై విలే పార్లేలోని కింగ్‌ఫిషర్ హౌస్‌ను రుణ రికవరీ ట్రిబ్యునల్ ఇటీవల 9వ సారి వేలం వేసింది. చివరకు హైదరాబాద్‌కు చెందిన శాటర్న్ రియల్టర్స్ రూ.52.25 కోట్లకు దీనిని కొనుగోలు చేసింది. ఈ డీల్ కోసం శాటర్న్ రియల్టర్స్ మహారాష్ట్ర ప్రభుత్వానికి స్టాంప్ డ్యూటీగా రూ.2.612 కోట్లు చెల్లించింది. జూలై 31న కింగ్‌ఫిషర్ హౌస్ కొనుగోలు ఒప్పందం జరిగింది.

ముంబై విమానాశ్రయం వెలుపల ఉన్న 2401.70 చదరపు మీటర్ల కింగ్‌ఫిషర్ హౌస్ ఆస్తి, 2016 నుంచి జప్తులో ఉన్నది. బెంగళూరుకు చెందిన డెట్ రికవరీ ట్రిబ్యునల్ దీనిని తొలుత రూ.135 కోట్ల ప్రారంభ రిజర్వ్ ధర కింద విక్రయించడానికి చేసిన ఎనిమిది ప్రయత్నాలు విఫలమయ్యాయి. చివరకు 9వ సారి వేలంపాటలో హైదరాబాద్‌కు చెందిన శాటర్న్ రియల్టర్స్ రూ.52.25 కోట్లకు కింగ్‌ఫిషర్ హౌస్‌ను సొంతం చేసుకున్నది. కాగా, ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ 2012 అక్టోబర్ 20 నుంచి విమాన సేవలను నిలిపివేసింది.

# రక్తదానం ప్రాణదానంతో సమానం : ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



కొడంగల్, ఆగష్టు 14:: రక్తదానం చేయడంవల్ల ప్రాణదానం చేసినంత ఫలితం ఉంటుందని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక తసీల్దార్ కార్యాలయంలో 75వ గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని ఇంచార్జి తాసీల్దార్ ఆనంద్ ఆధ్వర్యంలో లైఫ్‌కేర్ ఫౌండేషన్, నవోదయ ఆసుపత్రి వారు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అదేవిధంగా డా.రవీంద్రయాదవ్ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల కూడా శరీరంలో కొత్త రక్తం ఉత్పత్తి తో రక్త శుద్ధి జరుగుతుందని తెలిపారు.

సంవత్సరంలో ఓ సారి తప్పకుండా రక్తదానం చేస్తే ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. కొందరికి రక్తం ఇవ్వడం వల్ల ఇబ్బందులు ఏర్పడతాయనే అపోహలు ఉంటాయి. అటువంటివి ఏమీఉండవని, రక్తం ఇవ్వడం వల్ల శరీరంలో కొత్త రక్తం ఉత్పత్తి అయ్యి ఆరోగ్యంగా ఉండడానికి ఆస్కారం ఉంటుందని తెలిపారు. ఈ శిబిరంలో 60 మందికి పైగా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ పండ్లు, ఎనర్జీడ్రింగ్, గుడ్డును అందించి, లైఫ్‌కేర్ ఫౌండేషన్ తరఫున సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముక్, మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్, వైద్యులు డా.రతన్‌కుమార్, లైఫ్‌కేర్ ఫౌండేషన్ సిబ్బంది చంద్రకాంత్‌రెడ్డి, అనిల్‌తో పాటు తసీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లాలో భారీగా పీడీఎస్ బియ్యం పట్టివేత



సంగారెడ్డి ఆగష్టు 14:(నేటినిజం ప్రతినిధి): సంగారెడ్డి జిల్లాలో భారీగా రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. అక్రమంగా లారీల్లో తరలిస్తున్న 90 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. జహీరాబాద్ మీదుగా ఇతర రాష్ట్రాలకు పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు నిఘాపెట్టి పోలీసులు జహీరాబాద్ శివారులో వాహన తనిఖీలు చేపట్టారు. మూడు లారీల్లో బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బియ్యంతోపాటు లారీలను సీజ్ చేసి పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు. బియ్యాన్ని హైదరాబాద్ నుంచి గుజరాత్‌కు తరలిస్తున్నట్లు విచారణలో గుర్తించామని అధికారులు తెలిపారు.

# చెరువుల పునరుద్ధరణపై ఎన్జీటీ కీలక తీర్పు

హైదరాబాద్ , ఆగష్టు 14:తెలంగాణలో చెరువుల పునరుద్ధరణపై ఎన్జీటీ కీలక తీర్పును వెలువరించింది. శేరిలింగంపల్లి లింగంకుంటలో ఎస్టీపీ నిర్మాణాన్ని సవాల్ చేస్తూ ఎన్‌జీటీలో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ జరిపిన ఎన్జీటీ.. చెరువుల పరిధిలో ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అక్రమ నిర్మాణాల తొలగింపునకు న్యాయపరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. త్వరలో చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు ఖరారు చేయాలని తెలిపింది. బఫర్ జోన్లలో నిర్మాణాలకు అనుమతులు ఇవ్వొద్దని ఎన్జీటీ సూచించింది. చెరువుల పరిరక్షణకు సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించాలని పేర్కొంది.

# దళిత బంధు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలి: కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్

## 3వ రోజు రిలే నిరహార దీక్షకు కాంగ్రెస్ పార్టీ మద్దతు



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 14:(నేటినిజం ప్రతినిధి): షెడ్యూలు కులాల సమగ్ర రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మూడవ రోజు రిలే నిరాహార దీక్ష వేములవాడ తెలంగాణ చౌక్లో చేపడుతున్న శాత్రాజపల్లి పల్లి గ్రామానికి చెందిన దళిత సోదరులకు వేములవాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆది శ్రీనివాస్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత బంధు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని ఆయన కోరారు. ఉప ఎన్నికలు ఉన్న కాడనే దళిత బంధు ఇస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళితులకు ఎట్లా అని ఆయన ప్రశ్నించారు. హుజురాబాద్ లో దళితులకు 10 లక్షలు ఇస్తున్న సందర్భంగా మేము స్వాగతిస్తూ మరియు రాష్ట్రవ్యాప్తంగా దళితులు అందరికీ ఇవ్వాలని ఆయన కోరారు. పోరాటాల గడ్డ ఇంద్రవెల్లి సాక్షిగా పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఉప ఎన్నిక ఉంటే ఇస్తారా లేకుంటే ఇవ్వరా అని ఆయన అనడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ప్రతి ఒక దళిత కుటుంబాలకు ఇవ్వాలని ఆయన కోరడం జరిగిందని దళితులు చేపట్టే ఏ కార్యక్రమానికైనా కాంగ్రెస్ పార్టీ మద్దతు ఉంటుందని ఆయన అనడం జరిగిందని. టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు రాష్ట్రవ్యాప్తంగా దళిత బంధు తీసుకురావాలని లేనిపక్షంలో మీయొక్క ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన దళిత బంధు వస్తదని కాంగ్రెస్ పార్టీ ఒక నిర్ణయానికి రావడం జరిగిందని వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ఆయన కోరారు ఆయన వెంట షెడ్యూలు కులాల నాయకులు తో పాటు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి,కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంగ స్వామియాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్ కార్యదర్శి లింగంపల్లి కిరణ్, గసికంటి ప్రభాకర్, శేఖర్, తదితరులు ఉన్నారు

# రుద్రవరం సింగిల్విండో పాలకవర్గాన్ని అభినందనలు



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 14:(నేటినిజం ప్రతినిధి): రుద్రవరం సింగిల్విండో క్వార్టర్లీ ఇన్స్పెక్షన్ శనివారం కోనరావుపేట కేడీసీసీ బ్యాంకు అడిషనల్ మేనేజర్ పరశురాం లావాదేవీలపై పరిశీలించారు , ఈ సందర్భంగా రైతులకి ఎల్లవేళ సహకారాలు అందిస్తున్నందుకు పాలకవర్గాన్ని అభినందించడం జరిగిందిని రుద్రవరం సింగిల్విండో చైర్మన్ కృష్ణదేవరాయల తెలిపారు.

# ఏపీలో కొత్తగా 1,535 కరోనా పాజిటివ్ కేసులు నమోదు

అమరావతి, ఆగష్టు 14: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గడిచిన 24 గంటల్లో కొత్తగా 1,535 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. 69,088 శాంపిల్స్‌ను పరీక్షించగా వీటిలో 1,535 పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యాయి. కొవిడ్-19తో తాజాగా 16 మంది చనిపోయారు. 2,075 మంది వ్యాధి నుంచి పూర్తిగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. జిల్లాల వారీగా తాజాగా నమోదైన కొవిడ్ మృతుల వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు, కృష్ణా, నెల్లూరులో ముగ్గురు చొప్పున, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరిలో ఇద్దరు చొప్పున, గుంటూ, వైఎస్ఆర్ కడప, విశాఖపట్నంలో ఒక్కరు చొప్పున మరణించారు.

